సిటీ పోలీసు యాక్ట్ అమలు : సిపి రష్మీ పెరుమాళ్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈనెల 23 నుంచి జూన్ 7 వరకు సిటీ పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ రష్మీ పెరుమాళ్ గురువారం తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. ధర్నాలు, రాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. బందల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసివేయాలని ఒత్తిడి బెదిరింపులకు గురిచేసేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే కమిషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. నిబంధలను ఉల్లంఘించి డిజె వినియోగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిపి రష్మీ పెరుమాళ్ల పేర్కొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

నేషనల్ బేస్ బాల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌కు చరిత్‌రెడ్డి ఎంపిక

వర్గల్, మే 21 (ప్రభాతవార్త):
ఈనెల 24వ తేదీ నుండి 29వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరిగే 30వ సబ్ జూనియర్ నేషనల్ బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌కు వర్గల్ మండలం నెంటూర్ గ్రామానికి చెందిన చరిత్‌రెడ్డి ఎంపికైనట్లు గ్రామ సర్పంచ్ నాగరాజు తెలిపారు. ఇటీవల నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి సెవెన్త్ బెటాలియన్‌లో నిర్వహించిన 6వ తెలంగాణ సబ్ జూనియర్ బేస్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సిద్దిపేట జిల్లా నుండి ఎంపికై తెలంగాణ బేస్ బాల్ జట్టులో స్థానం సంపాదించిన చరిత్‌రెడ్డిని గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ చరిత్‌రెడ్డి నేషనల్ బేస్ బాల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌కు ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని అన్నారు. చరిత్‌రెడ్డికి ప్రోత్సాహం అందించి సహకరించిన పీఈటి శ్రీకాంత్, విశ్వశాంతి విద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ దయాకర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రైతులతో మాట్లాడుతున్న సీపీ రష్మీ పెరుమాళ్

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి
సిపి రష్మీ పెరుమాళ్

మిరుదొడ్డి, మే 21, ప్రభాతవార్త : ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సీపీ రష్మీ పెరుమాళ్ అధికారులను, రైస్‌మిల్లర్లను ఆదేశించారు. మండల పరిధిలోని మోతె గ్రామంలోని భారతి రైస్ మిల్, భూంపల్లి అక్బుర్‌పేట మండల పరిధిలోని సోమనాథ్ ఇండస్ట్రీస్‌లను ఆమె గురువారం ఆకస్మికంగా సందర్శించారు. మిల్లులో ధాన్యం దిగుమతి, మిల్లింగ్ ప్రక్రియ జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. అనంతరం మిరుదొడ్డి మండలం రుద్రారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతూ ధాన్యం అమ్మకాల్లో ఎదురవుతున్న సమస్యలు,రవాణా సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే లోడ్‌లను వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియ మధ్య సమన్వయం ఉండాలన్నారు. మిల్లుల వద్ద లారీల నిలిపివేత లేకుండా చూసుకోవాలని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మిల్లింగ్ ప్రక్రియను సజావుగా సాగించాలని మిల్లర్లను ఆదేశించారు. శాంతిభద్రతల పరంగా, కొనుగోళ్ల నిర్వహణలో పోలీసుశాఖ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఆమె వెంట పోలీసు అధికారులు తదితరులు ఉన్నారు.

ధాన్యం తూకాన్ని పారదర్శకంగా నిర్వహించాలి
మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్

పెద్దశంకరంపేట, మే 21, ప్రభాతవార్త : మండల పరిధిలోని రాచరాయ, సప్తగిరి రైస్ మిల్లులను జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. మిల్లుల వద్ద నిల్వ ఉన్న ధాన్యం లోడ్ల పరిస్థితిని పరిశీలించి, హమాలీల సంఖ్య, మిల్లుల్లో జరుగుతున్న పనితీరును ఆరా తీశారు. అదేవిధంగా ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. తూకం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.ధాన్యం కొనుగోలు, రవాణా, అన్లోడింగ్ వ్యవహారాల్లో సమన్వయంతో పని చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు.

ధాన్యం అన్‌లోడింగ్ పనులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ నగేష్

జూన్ 2న ముఖ్యమంత్రి చేతుల మీదుగా
సామూహిక ఇందిరమ్మ గృహ ప్రవేశాలు

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కె.హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న సిఎం చేతులమీదుగా సామూహిక ఇందిరమ్మ గృహ ప్రవేశాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లాలో స్లాబ్ లెవల్ నిర్మాణంలో ఉన్న అన్ని గృహాలు పూర్తి స్థాయిలో నిర్మించి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో ప్రారంభించడానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ఇందిరమ్మ ఇళ్లు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం నూతన ఘన వ్యర్థాల నిర్వహణ-2026పై ఎంపిడివో, ఎపివో, గృహనిర్మాణ, ఎపిఎం, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.మండల పరిషత్, గృహనిర్మాణ ఇంజనీరింగ్ అధికారులే గ్రామాలవారీగా లబ్దిదారులను కలిసి నిర్మాణంలోని గృహాలను వేగంగా పూర్తి చేయించాలన్నారు. ఈ నెల 30 వరకు మార్కింగ్ పెండింగ్ ఉన్న పనులు మొదలు పెట్టాలని లేనియెడల డిలీట్ చేయాలని ఆదేశించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీఓ భవనాలు, ఫుడ్‌గ్రైన్ స్టోరేజ్, పెడరేషన్ బిల్డింగ్స్ కాంట్రాక్టర్ ముందుకు రానియెడల సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించి పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జూన్ 15 వరకు పనులు పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ప్రస్తుతం రోజు 53 వేలు లేబర్ సంఖ్య ఉందని ఈ లేబర్ సంఖ్యను ఎక్కువ మొత్తంలో పెంచాలన్నారు. ప్రతి గ్రామంలో ఒక టార్గెట్ ప్రకారం పనులు చేపట్టాలన్నారు. ఈ ఏడు వనమహోత్సవంలో జిల్లాలో 15 లక్షల టార్గెట్ కేటాయించారని నర్సరీలు నిర్వహణ చేయాలని ఎస్‌హెచ్‌జీ మహిళలతో సమావేశం నిర్వహించి ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. చేయూత పెన్షన్ గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం నూతన ఘన వ్యర్థాల నిర్వహణ-2026 నిధులు ప్రాధాన్యత ప్రకారం సర్పంచ్ జనరల్ బాడీ నేతృత్వంలో తీర్మాణం ప్రకారం వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రమేష్, డిఆర్‌డిఎ పిడి జయదేవ్ ఆర్య, డిపివో రవీందర్, పంచాయతీరాజ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్ ఎండి యూనుస్, వైస్ చైర్మన్ శిరీష సురేందర్‌రెడ్డి

మూడున్నర కోట్ల పనులకు కౌన్సిల్ ఆమోదం
సమావేశాన్ని బహిష్కరించిన టీఆర్ఎస్, బిజెపి సభ్యులు

జహీరాబాద్, మే 21 ప్రభాతవార్త : పట్టణంలోని 37 వార్డులలో వివిధ వివిధ అభివృద్ధి పనులకు 42 ప్రతిపాదనలతో మూడున్నర కోట్ల పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపారు. గురువారం మున్సిపల్ చైర్మన్ ఎండి యూనస్ అధ్యక్షతన మున్సిపల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పట్టణంలోని అన్ని మున్సిపల్ వార్డులలో సిసి రోడ్లు మురికి కాలువ నిర్మాణం, సీసీ కల్వర్టు, హాయ్ మాస్ లైట్ లు ఏర్పాటు, స్ట్రీట్ లైట్ మురికి కాల్వల శుభ్రపరచుట, డంపింగ్ యార్డులో మిషనరీ కొనుగోలు చేయుట, వివిధ వార్డుల్లో చెడిపోయిన బోర్ల రిపేరింగ్ తదితర పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపారు. సమావేశం కాగానే బిఆర్ఎస్ బిజెపి సభ్యులు సమావేశం నుండి ఆకౌట్ చేశారు. ప్రజలు కట్టిన పనుల డబ్బులు అధికార కాంగ్రెస్ పార్టీ చైర్మన్ కౌన్సిలర్లు ఇష్టాను సారం డబ్బులను ఖర్చు చేస్తున్నారని నిరసనగా తాము సభ నుండి వాకౌట్ చేస్తున్నామని బిఆర్ఎస్ బిజెపి సభ్యులు తెలిపారు. అనంతరం సభ కొనసాగి ఏ జెండాలో పొందుపరిచిన పనులకు ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జైత్రీరామ్, డి ఈ దీప్తిచంద్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే ప్రధాన ధ్యేయం : మున్సిపల్ చైర్మన్

జహీరాబాద్ పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరచాలని ఉద్దేశంతో 37 వార్డులలో పార్టీల కతీతంగా అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. మున్సిపల్ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష టిఆర్ఎస్ బిజెపి సభ్యులు తాము చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే తనపై అబాండాలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అన్ని వార్డులలో వివక్ష లేకుండా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. తాము చేపడుతున్న అభివృద్ధి పనులకు కౌన్సిలర్లు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ విజ్ఞప్తి చేశారు.

'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 21, ప్రభుత్వవార్త : ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 22న నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమ ఏర్పాట్లపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ గురువారం సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్యక్రమాన్ని ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ఇప్పటికే ప్రజా పాలన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలు, ప్రభుత్వం కేటాయించిన నిధుల సమాచారం,జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, సాధించిన పురోగతిని ప్రజలకు వివరించేలా ఆయా శాఖల అధికారులు తదితర అంశాలతో సమగ్ర నివేదికలు సిద్ధం చేసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా అధికారులు సమన్వయంతో బాధ్యతలు నిర్వర్తించాలని తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో అడిషనల్ కలెక్టర్లు, జడ్పీ సీఈవో, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, రెవెన్యూ అధికారులు తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారులకు నెమలి అప్పగింత

నాగల్‌గిద్ద, మే 21, ప్రభాతవార్త: అనారోగ్యంతో అవస్థలు పడుతున్న జాతీయ పక్షి నెమలిని పర్యవరణ పరిరక్షులు జ్ఞానేశ్వర్ అటవీశాఖ అధికారులకు అప్పగించారు. మండల పరిధిలోని ముక్తాపూర్ గ్రామ శివారులో జాతయ పక్షి నెమలి అనారోగ్యంతో అవస్థలు పడుతున్నట్లు గమనించిన జ్ఞానేశ్వర్ అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించి బీట్ అధికారరి డిగంబర్‌కు నెమలిని అందచేశారు.

అనారోగ్యంతో బాధపడుతున్న జాతీయ పక్షి నెమలిని అటవీశాఖ అధికారులకు అప్పగిస్తున్న జ్ఞానేశ్వర్

రోడ్డు ప్రమాదంలో టిఆర్‌టిఎఫ్‌నేత ప్రభాకర్ మృతి
శోకసంద్రంలో ఉపాధ్యాయులు

జి.ప్రభాకర్(ఫైల్‌ఫొటో)

రామాయంపేట, మే 21, ప్రభాతవార్త : టిఆర్‌టిఎఫ్ శంకరంపేట(ఆర్) అధ్యక్షుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గోడిశల ప్రభాకర్ బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన మృతితో ఉపాధ్యాయ లోకమంతా శోకసంద్రంలో మునిగి పోయింది. రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామ వాస్తవ్యులైన ప్రభాకర్ మృతి ఉపాధ్యాయ వర్గానికి తీరని లోటని టీఆర్టీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. టీఆర్టీఎఫ్ సంఘ ప్రతిష్టత కోసం ప్రభాకర్ చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సంఘం అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఉపాధ్యాయులతో కలుపుగోలుగా ఉంటూ స్నేహశీలిగా మెలిగిన ప్రభాకర్ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. జిల్లాలో సంఘం విస్తరణ కోసం ఆయన అందించిన తోడ్పాటు మరువలేనిదని మెదక్ జిల్లా టీఆర్టీఎఫ్ అధ్యక్షులు ఎం.ప్రవీద్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింగరావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి భైతి ఐలయ్య పేర్కొన్నారు. గురువారం వారు ప్రభాకర్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. రామాయంపేట, నిజాంపేట మండల శాఖ బాధ్యులు నాగేందర్, నరసింహారావు, నవీన్, రత్నాకర్, మహేశ్వర్, జిల్లా బాధ్యులు మోహన్, శ్రీనివాస్, రమేష్, రషీద్, ఇతర మండల బాధ్యులు విఠల్, శేఖర్, సంతోష్, వెంకట్ రెడ్డి, విద్యాసాగర్ తదితరులు అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

మిర్చి మిల్లులో చోరీ...
రూ. 70 వేల నగదు అపహరణ

నర్సాపూర్, మే 21, ప్రభాతవార్త : గుర్తుతెలియని వ్యక్తులు మిర్చి మిల్లులో చోరీకి పాల్పడి 70 వేల నగదు అపహరించిన సంఘటన నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామ సమీపంలోగల మిర్చిమిల్లులో గురువారం జరిగింది. ఎస్ఐ రంజిత్ కుమార్‌రెడ్డి కథనం ప్రకారం...నర్సాపూర్ మెదక్ జాతీయ ప్రధాన రహదారిలోని రెడ్డిపల్లి గ్రామ సమీపంలోని పెద్ద చింతకుంట గ్రామ శివారులోగల నర్సాపూర్‌కు చెందిన మీర్ ముజాహిద్ అలీ మిర్చిమిల్లు ఏర్పాటు చేసి మిర్చి పౌడర్ విక్రయిస్తూ జీవిస్తున్నాడు. మిర్చి మిల్లులో సద్దాం మన్సూరీ, ఆదంలు పనిచేస్తూ రాత్రివేళ అక్కడే కాపలాగా ఉంటారని తెలిపారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఆ కాపలాదారులు ఇద్దరు మిర్చి గిర్ని ముందర నిద్రపోతుండగా వెనక భాగం నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప షీటును తొలగించి లోపలికి జొరబడి కౌంటర్ తాళాలను పగలగొట్టి అందులో ఉన్న నగదు 70 వేల రూపాయలను అపహరించారని తెలిపారు. గుర్తుతెలియని దొంగలు ఈ మిల్లులో ఉన్న రివోల్వింగ్, సిసి కెమెరాలను డిస్‌కనెక్ట్ చేశారు. కాపలాదారులు మిర్చి యజమానికి సమాచార అందించడంతో వెంటనే వచ్చిన యజమాని మీర్ ముజాహిద్ అలీ లోపలికి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడేసి కౌంటర్‌లోని 70 వేల నగదు రూపాయలు ఎత్తుకెళ్లారని తెలిపారని అతడు తెలిపాడు. మిర్చి మిల్లు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తెలిపారు

ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 21, ప్రభాతవార్త :
జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమంపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటర్ జాబితా సవరణకు సంబంధించిన వివిధ దశలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటర్ల జాబితాను పరిశీలించడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.అన్ని రాజకీయ పార్టీలు తక్షణమే అన్ని నియోజకవర్గాలలో బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని, అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన వివిధ దశల షెడ్యూల్ వివరాలను సమావేశంలో వివరించారు. సమావేశంలో సంగారెడ్డి తహసిల్దార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగపు అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

ధాన్యం కొనుగోలు నిర్లక్ష్యంపై కలెక్టర్ సీరియస్
డిసిఓ, ఎంపీడీవో, ఏపీఎంలకు షోకాజ్ నోటీసులు జారీ

సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 21, ప్రభాతవార్త :
హత్నూర మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం, సమన్వయ లోపాలు, పర్యవేక్షణలో వైఫల్యాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్, హత్నూర ఎంపీడీవో బి.శంకర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజశేఖర్‌లకు షోకాజ్ నోటీసులు జారీచేశారు. హత్నూర మండలంలో ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు సంతృప్తికరంగా నిర్వహించబడటం లేదని గుర్తించామని, కొనుగోలు కేంద్రాల వద్ద పర్యవేక్షణ, మానిటరింగ్, సమన్వయంలో తీవ్ర లోపాలు ఉన్నట్లు వెల్లడైందన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు రాకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫీల్డ్ స్థాయిలో సమర్థవంతమైన పర్యవేక్షణ లేకపోవడం, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యాలు చోటు చేసుకోవడం,సంబంధిత శాఖలు, ఏజెన్సీల మధ్య సమన్వయం లోపించడంవల్ల కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సకాలంలో పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు.
ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీచేసి, మూడురోజుల్లోగా వివరణ సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

పాపన్నపేట, మే 21, ప్రభాతవార్త : సంతాన లేమితో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలపరిధిలోని చికోడ్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం... బోయిని పర్వయ్య, అనూషమ్మలకు ఇరువురు కుమారులు కాగా పెద్ద కుమారుడు సంగమేశ్వర్, చిన్నకుమారుడు సాయిబాబా(32). కాగా ఇద్దరికి వివాహాలు జరుపగా చిన్న కుమారుడు సాయిబాబా పని పాట చేయకుండా జులయిగా తిరుగుతుండేవాడు. అంతేగాక భార్య వాసవితో తరచూ గొడవలు చోటుచేసుకుంటుండమే కాక సంతానం లేకపోవడం మూలంగా గొడవలు జరుగుతుండేవి. బుధవారం భార్య భర్తల మధ్య గొడవ జరగడంతో మధ్యాహ్నం ఇంటిలోని గదిలోకి వెళ్లి గడియ వేసుకోవడంతో అనుమానం వచ్చిన భార్య వాసవి, అత్త అనూషమ్మకు తెలపడంతో ఇరువురు వెళ్లి గడియ తీయాలని పిలిచినా పలకకపోవడంతో పెద్ద కుమారుడు సంగమేశ్వర్ సహాయంతో గడ్డపార తలుపులు సందుచేసుకొని చూడగా దూలానికి చీరతో ఉరేసుకొని ఉండడాన్ని గమనించి వెంటనే పాపన్నపేట పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి పంచనామా నిర్వహించి మృతుడి తల్లి అనూషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కాగా మృతుడికి భార్య వాసవి, తల్లి అనూషమ్మ ఉన్నారు.

శంకాపూర్‌లో మరో యువకుడు...

నార్సింగి, మే 21, ప్రభాతవార్త : చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నార్సింగి మండలం శంకాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై సృజన కథనం ప్రకారం... శంకాపూర్ గ్రామానికి చెందిన గడ్డం మల్లమ్మకు ఇద్దరు కొడుకులు. చిన్న కొడుకు గడ్డం ప్రశాంత్ రెడ్డి(29) మూడు సంవత్సరాలుగా హైదరాబాదులో మణికొండలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ నివాసం ఉంటున్నాడు. ఈ నెల 16న స్వగ్రామం శంకాపూర్‌కు వచ్చాడు. రియల్‌ఎస్టేట్ వ్యాపారం సరిగా నడవడం లేదు అప్పుల పాలయ్యానని చెప్పుతూ అప్పుడప్పుడు మనస్థాపం చెందేవాడని తల్లి మల్లమ్మ తెలిపింది. బుధవారం రాత్రి పొలం వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడని ఉదయం చుట్టుపక్కల పొలాల వారు చూసి సమాచారం అందివ్వడంతో అక్కడ వెళ్లి చూసేసరికి నైలాన్ తాడుతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

షార్ట్ సర్క్యూట్‌తో వరి పంట దగ్ధం

షార్ట్ సర్క్యూట్‌తో కాలి బూడిదైన వరిపంట దృశ్యం

అక్కన్నపేట, మే 21, ప్రభాతవార్త : అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దోమ యాదిరెడ్డికి చెందిన రెండు ఎకరాల వరి పంటతో పాటు గడ్డి పూర్తిగా కాలిపోయింది. అలాగే రైతు లింగారెడ్డికి చెందిన దాదాపు ఆరు ఎకరాల గడ్డి కట్టలు, పొలంలో నిల్వ ఉంచిన గడ్డి మంటల్లో దగ్ధమయ్యాయి. పొలాల్లో మంటలు వ్యాపించడంతో స్థానికులు వెంటనే ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే పెద్ద మొత్తంలో పంట, గడ్డి కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. రైతులకు భారీ నష్టం వాటిల్లినట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

90 నిమిషాల్లోనే చైన్ స్నాచర్ అరెస్ట్

నిందితుని వివరాలు వెల్లడిస్తున్న ఎసిపి సదానందం

హుస్నాబాద్ రూరల్, మే 21 ప్రభాతవార్త: హుస్నాబాద్ పట్టణంలో వృద్ధ మహిళ మెడలోని బంగారు గొలుసును అపహరించిన నిందితుడిని 90 నిమిషాల్లోనే గుర్తించి అదుపులోకి తీసుకున్న సీసీఎస్, హుస్నాబాద్ పోలీసులు ప్రశంసలు అందుకున్నారు. గురువారం హుస్నాబాద్ ఏసీపీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హుస్నాబాద్ ఏసీపీ సాదారపు సధానందం నింది తుడి వివరాలను వెల్లడించారు. నిందితుడు అల్లెపు కృష్ణ అయిలేని లక్ష్మీ(76)ని సమీపించి నెలకు రూ.4 వేల పెన్షన్ ఇప్పిస్తానని నమ్మించాడు. అనంతరం గాయత్రి బ్యాంకులో లైన్‌లో ఎంత మంది ఉన్నారో చూసి వస్తానని చెప్పి వెళ్లి తర్వాత బ్యాంకులో ఫొటో కోసం పుస్తెల తాడు కావాలని, ఫొటో దిగిన వెంటనే తిరిగి ఇస్తానని నమ్మించి, బాధితురాలు లక్ష్మీ మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు చైన్ తీసుకొని పరారయ్యాడన్నారు. బాధితురాలి నుంచి సమాచారం అందుకున్న వెంటనే హుస్నాబాద్ ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి అప్రమత్తమై ఘటన స్థలానికి కానిస్టేబుల్ నరేష్‌తో కలిసి చేరుకొని సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి నిందితుడి కదలికలను గుర్తించి వెంటనే సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పెండ్యాల దేవేందర్, వారి బృందం రంగంలోకి దిగి, సీసీ ఫుటేజ్‌ను పరిశీలించి కేవలం గంటన్నర వ్యవధిలోనే హుస్నాబాద్ బస్టాండ్ వద్ద నిందితుడు అల్లెపు కృష్ణను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ఈ కేసులో నిందితుడిని పట్టుకున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు పెండ్యాల దేవేందర్, రవీందర్, సీసీఎస్ ఎస్సై తిరుపతి, హుస్నాబాద్ ఎస్సై లక్ష్మారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు యాదగిరి, నగేష్, కానిస్టేబుల్ నరేష్‌లను సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ అభినందించారు. ఈ ఘటన ద్వారా సీసీ కెమెరాల ప్రాముఖ్యత మరొకసారి స్పష్టమైందని ఏసీపీ తెలిపారు. ప్రజలు ఇళ్లలో, వ్యాపార సంస్థల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలని కోరారు.

ఇబ్రహీంనగర్‌లో బెల్ట్ షాపులపై దాడులు

చిన్నకోడూరు, మే 21, ప్రభాతవార్త : మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ లో అక్రమంగా నడుస్తున్న రెండు బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్, పోలీసులు గురువారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. కిరాణా దుకాణాల్లో మద్యం విక్రయిస్తూ కూర్చోబెట్టి తాగిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టగా 46 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. గౌరిశెట్టి శ్రీనివాస్, పంతం లక్ష్మణ్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ వివరించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

ఉచిత వాటార్ ట్యాంకర్ల కోసం కాంగ్రెస్ నేతల వినతి

వాటర్ బోర్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకట్ రెడ్డిని కలిసి నీటి సమస్యపై వినతిపత్రాన్ని సమర్పిస్తున్న గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి సాయి కీర్త్ (బాబ్జి)

చిక్కడపల్లి మే 21 ,ప్రభాతవార్త : గాంధీనగర్ డివిజన్ పరిధిలోని ఎస్సార్టీ, టీఆర్టీ ఈ క్వార్టర్స్ ప్రాంతాల్లో నెలకొన్న తీవ్రమైన తాగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బింగి సాయి కీర్త్ (బాబ్జి) నాయకత్వంలో కాంగ్రెస్ నాయకులు వాటర్ బోర్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకట్ రెడ్డి ని కలిసి సమస్యలతో కూడిన కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బింగి సాయి కీర్త్ (బాబ్జి) మాట్లాడుతూ నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న లోతట్టు ప్రాంతాలకు ప్రతిరోజూ రెండు ఉచిత తాగునీటి ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. వేసవి కాలంలో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మహిళలు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు వివరించారు. ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకుని తక్షణ చర్యలు తీసుకుని నిరంతర తాగునీటి సరఫరా జరిగేలా చూడాలని వారు అధికారులను కోరారు. సమస్య పరిష్కారానికి సహకరిస్తామని డీజీఎం వెంకట్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు న్యాయం జరిగేలా బాధ్యత తీసుకుంటా

సమావేశంలో మాట్లాడుతున్న మోతె శోభన్‌రెడ్డి. చిత్రంలో చీమా శ్రీనివాస్

సైఫాబాద్, మే 21 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారులందరికి న్యాయం జరిగేలా బాధ్యత తీసుకుంటానని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉద్యమకారుల కమిటి సభ్యుడు మోతె శోభన్‌రెడ్డి చెప్పారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారులు ఎన్నో కష్టాలు పడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిపెట్టారని, వారి పోరాటం ఎన్నటికి మరువలేనిదని, వందలాది మంది ఉద్యమకారులు బలిదానాలు చేశారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందరిని అదుకుంటుందన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఛైర్మన్ డాక్టర్ చీమా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కెకె కమిటిని ఏర్పాటు చేసిన సిఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్, శాసన సభ, శాసన మండలిలో ఉద్యమకారుల గురించి ప్రస్తావించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ధన్యవాదాలు తెలిపారు. 2029లో జరిగే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డిని ఉద్యమకారులంతా మళ్ళీ సిఎంగా గెలిపించుకుంటారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన సిఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఫోరం నాయకులు దయానంద్, జగన్‌యాదవ్, మంజుషా, నాగజ్యోతి పాల్గొన్నారు.

సహృదయ సాహితీ మణి కృష్ణకుమారి : మధుసూదనాచారి

ప్రఖ్యాత రచయిత్రి డాక్టర్ కె వి కృష్ణ కుమారికి కళాలలిత త్రిపుర సుందరి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి మే 21 (ప్రభాతవార్త): పెద్దలు పిన్నలు అందరిచే కృష్ణక్క గా పిలువబడే కృష్ణ కుమారి సహృదయ సాహితీ మణి అని శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా లలిత కళా వేదిక పై భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో గాన సభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్దన మూర్తి అధ్యక్షతన ప్రఖ్యాత రచయిత్రి డాక్టర్ కె వి కృష్ణ కుమారి కి కళా లలిత త్రిపుర సుందరి పేరిట మాతృ దినోత్సవ సందర్భం గా పురస్కార ప్రదానం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సిరికొండ మధుసూదనాచారి పురస్కారం బహూకరించి మాట్లాడారు. లలిత పూర్వ్య గాన సభ అధ్యక్షుడు కళా సుబ్బారావు ధర్మ పత్నిగా ప్రస్తుత అధ్యక్షుడు జనార్ధన మూర్తి మాతృ మూర్తి గా సంప్రదాయ జీవనం తో కుటుంబాన్ని తీర్చిదిద్దారు అని అన్నారు కృష్ణ కుమారి అభ్యుదయ భావాలు కలిగి ఉన్నా సంప్రదాయ పరిధిలో రచనలు చేశారని చెప్పారు. యువ కళా వాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ, ,గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి,గాన సభ సభ్యులు శంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.

వీణా నాదం, నృత్యాలతో మంత్రముగ్ధులైన ప్రేక్షకులు



విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను ప్రదానం చేసిన దృశ్యం

చిక్కడపల్లి మే 21 ప్రభాతవార్త : చిక్కడపల్లి త్యాగరాయ గానసభ గురువారం చిన్నారుల కళా ప్రదర్శనలతో సందడిగా మారింది. తల్లిదండ్రులకు ఆనందం, గురువులకు ఉత్సాహభరితమైన బాధ్యత, పిల్లలకు కళా ప్రదర్శనల ఉత్సాహం నింపుతూ ప్రముఖ భిన్న కళా ప్రక్రియల శిక్షణా సంస్థ"వాహిని" నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వీణ శిక్షకురాలు గోవిందు లక్ష్మి పద్మావతి ఆధ్వర్యంలో విద్యార్థులు అందించిన వీణా వాదనం సభికులను ముగ్ధులను చేసింది. అలాగే పాశ్చాత్య నృత్య గురువు మాధవ్, కూచిపూడి నృత్య గురువు రాజశ్రీ శిష్య బృందాలు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాయి. చిన్నారులు చూపిన ప్రతిభకు సభ అంతా చప్పట్లతో మార్మోగింది. సంస్థ డైరెక్టర్ లక్ష్మీ ప్రియ శంకరమంచి మాట్లాడుతూ, గత నెల ఏప్రిల్ 21 నుంచి నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో లలిత కళలతో పాటు యోగా, ధ్యానం, శ్లోకాలలో కూడా నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చామని తెలిపారు. శిబిరంలో విద్యార్థులు నేర్చుకున్న అంశాలను ప్రజల ముందుంచేందుకు ఈ ముగింపు వేడుకను నిర్వహించామని చెప్పారు. కళల పట్ల చిన్నారుల్లో ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని పలువురు తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఎలక్ట్రిక్ కారు బీభత్సం

కెపిహెచ్‌బి కాలనీ, మే 21, ప్రభాతవార్త : కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీలో బుధవారం మధ్యాహ్నం ఓ ఎలక్ట్రిక్ కారు బీభత్సం సృష్టించింది. వివేకానందనగర్ నుంచి ఆల్విన్ కాలనీ వైపు వెళ్తున్న కారు ఓవర్ స్పీడ్‌తో అదుపు తప్పి ఎదురుగా వెళ్తున్న టూ వీలర్లను, తర్వాత ఎదురుగా వచ్చిన మరో కారును ఢీకొట్టింది. ఆతర్వాత అవతలి రోడ్డువైపు ఉన్న ఏరువాక టిఫిన్ సెంటర్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడం గమనార్హం. అయితే పలు వాహ నాలు, టిఫిన్ సెంటర్ ధ్వంసమైంది. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎలక్ట్రిక్ కారులో సాంకేతిక లోపం కారణంగా ప్రమాదం జరి గిందా? లేదా వేరే కారణాలు ఉన్నాయా? అనే విషయంపై దర్యాప్తు చేపట్టారు.

రాజీవ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మలేషియా టౌన్షిప్ వద్ద రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ రాజీవ్ సర్కిల్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సత్యం శ్రీరంగం

: రాజీవ్ గాంధీకి నివాళులు అర్పిస్తున్న నీలిమ

రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న గౌరవల్లి రమేష్.

బాలంరాయిలో రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్ వద్ద రాజీవ్ గాంధీకి నివాళులర్పిస్తున్న జంపనప్రతాప్ తదితరులు

రాజీవ్ విగ్రహం వద్ద మల్కాజిగిరి పార్టీ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంత్ రెడ్డి అద్వర్యంలో నివాళులర్పిస్తున్న నేతలు

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్ తదితరులు

రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని రక్తదానం చేస్తున్న కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ముండ్రాయి శ్రీనివాస్

గౌలిపురా డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్తీక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆపార్టీ యాకుత్‌పురా ఇంచార్జ్ కె.రవిరాజు, నేతలు ఎం.కృష్ణ కుమార్, ఎం.శ్రీనివాస్, శశి యాదవ్, నళిని గౌడ్, శివకుమార్, శ్రీనివాస్, కిరణ్, ద్వారక్ గౌడ్ తదితరులు.

చార్మినార్ వద్ద జరిగిన మాజీ ప్రధాని,స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్యలాల్,జి.ఆనంద్,పులిపాటి రాజేష్ కుమార్

రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్

బాగ్ లింగంపల్లిలో టీపీసీసీ లింగ్విస్టిక్ మైనారిటీ సెల్ ఛైర్మన్ రాజేష్ కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జనార్ధన రెడ్డి, అంజి యాదవ్, రఘువీర్, అంజి యాదవ్, నవ్వ రాజు, నవీన్ నాయక్, నాగభూషణం, ఉదయ్ మున్నూరు , ఎన్.విశ్వనాథ్, పి. సాయి, శ్రీను

మంచినీటి కోసం గోస పడుతున్న మణికొండ వాసులు

- పట్టించుకోని జలమండలి అధికారులు, నాయకులు

- బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ

నార్సింగి, మే 21 ప్రభాతవార్త : మణికొండ, నెక్నాంపూర్ డివిజన్ల ప్రజలు మంచినీటి కోసం నిత్యం గోస పడుతున్నా జల మండలి అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ ఆరోపించారు. వాక్ ఫర్ వాటర్ కార్యక్రమంలో భాగంగా గురువారం మణికొండలోని ఎల్‌వీపీ కాలనీలో 1.ఎంఎల్‌డి సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌ను బిఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రిజర్వాయర్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో కాంగ్రెస్ పాలకులు అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని పేర్కొన్నారు. గత వారంలో బిఆర్ఎస్ చేపట్టిన వాక్ ఫర్ వాటర్‌కు ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన రావడంతో బెదిరిపోయిన అధికారులు అల్కాపూర్ స్పోర్ట్స్ పార్కులోని రిజర్వాయర్ నుంచి రెండు రోజులు నీటి సరఫరా చేసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. ఈ పార్కులో క్రీడా పరికరాల వద్ద చిన్న పిల్లలు ఆడుకునేందుకు రావద్దని బోర్డు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. నేతాజీ పార్కు, సెక్రెటేరియట్ కాలనీ వద్ద డబ్బులు వసూలు చేస్తూ నీటిని సరఫరా చేయడం దారుణమన్నారు. కృష్ణారెడ్డి కాలనీలోని రిజర్వాయర్ పడావుకు వేయడం అధికారుల నిర్లక్ష్యాన్ని వెల్లడి చేస్తుందన్నారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి స్థానిక ఎమ్మెల్యే పార్టీ మారారని పదేపదే భజనపరులు ప్రగల్బాలు పలుకుతున్నారని, ఇప్పుడు ప్రజలు నీటి కోసం ఇంత అల్లాడుతున్నా ఎందుకు ఏ నాయకుడు నీటిని సరఫరా చేయించలేకపోతున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, అందె లక్ష్మణ్‌రావ్, శ్రీకాంత్, విఠల్, ఆరిఫ్, భానుచందర్, సుమనళిని, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో గత ఏడాది నిర్మించిన రిజర్వాయర్‌ను పరిశీలించిన బిఆర్ఎస్ నాయకుల దృశ్యం.

మానసిక వికలాంగ మహిళను రక్షించి బంధవులకు అప్పగించిన పోలీసులు

గోషామహల్,మే21ప్రభాతవార్త: రోడ్డుపై దిక్కుతోచని స్థితిలో ఉన్న ఒక మానసిక వికలాంగ మహిళాను గోషామహల్ పోలీసులు రక్షించి,ఆమెను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించి,మానవత్వాన్ని చాటుకున్నారు. ఇన్‌స్పెక్టర్ బి.శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...జోషివాడి ప్రాంతంలో మానసిక వికలాంగురాలైన మహిళా వంటిపై వస్త్రాలు లేకుండా తిరుగుతున్నట్లు స్థానికులు అడ్మిన్ ఎస్.ఐ లక్ష్మయ్యకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్నారు.వెంటనే మహిళా కానిస్టేబుళ్ల విమల,దివ్య,హోంగార్డు రేవణ్‌స్వామిలను మానసికస్థితి వికలాంగురాలు తిరుగుతున్న మహిళా వద్దకు చేరుకున్నారు.ఆమెను సురక్షితంగా స్టేషన్‌కు తీసుకువచ్చారు.ఆమె ఫోటోను వివిధ పోలీస్ సమాచారం గ్రూపులో పంపించారు.హోంగార్డు రేవణస్వామి ఉస్మానియా ఆసుపత్రికి చేరుకుని ఆసుపత్రి నుంచి ఎవరైనా రోగికి తప్పిపోయారా అన్ని తెలుసుకున్న హోంగార్డు ఎస్ఐ లక్ష్మయ్యకు సమాచారం అందించారు.మానసిక వికలాంగురాలైన మహిళా కుమారుడిని గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు.తగిన ధృవీకరణ,గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసి అనంతరం,సదరు మహిళను,ఆమె బంగారు గొలుసుతో సహా కుమారుడికి అప్పగించారు. సకాలంలో స్పందించి,మహిళకు రక్షణ కల్పించి, కుటుంబ సభ్యులకు అప్పగించినందుకుగా గోల్కొండ జోన్ డిసిపి జి,చంద్ర మోహన్,గోషామహల్ ఎసిపి కె.చంద్రశేఖరరెడ్డిలు గోషామహల్ పోలీసులను అభినందించారు.- మానవత్వం చాటుకున్న కామాటిపురా పోలీసులు బక్రీద్ పండుగ భాగంగా బహుదూర్‌పురా చౌరస్తా వద్ద కామాటిపురా పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌బి.ప్రసాద్‌రావు తన పోలీసు సిబ్బందితో కలిసి చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్నారు.చెక్‌పోస్ట్ సమీపంనుంచి గుర్తు తెలియని మహిళా దుస్తులు లేకుండా నడుచుకుంటూ తిరుగుతున్న మహిళాను పోలీసులు గుర్తించారు.అర్ధరాత్రి కావడంతో దుకాణాలన్ని మూసివేయడంతో ఇన్‌స్పెక్టర్ బి.ప్రసాద్‌రావు తన కారులో ఉన్న పంచెతోపాటు యూనిఫాం చొక్కాను మహిళా కానిస్టేబుల్ ద్వారా ధరింప చేయించారు.ఆమె గౌరవాన్ని కాపాడారు.చెక్‌పోస్ట్‌లోనే ఆహారం,ఆశ్రయం కల్పించి రక్షించారు రాజేంద్రనగర్ ఎసిపి కిషన్ పర్యవేక్షణలో బక్రీద్ చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టారు.

జలమండలి ఎన్నికల్లో ఐఎన్‌టియుసికి టిఎన్‌జిఓస్ మద్దతు

హైదరాబాద్, మే 21 ప్రభాతవార్త : కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టియుసి)కు జలమండలి ఎన్నికల్లో టిఎన్‌జిఓఎస్ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. జూన్ 6న జరగనున్న జలమండలి ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టిఎన్‌జి ఓఎస్ నేతలు కార్మికులకు పిలుపునిచ్చింది. గురువారం నాంపల్లి టిఎన్‌జిఓఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఐఎన్‌టియుసి , టిఎన్‌జిఓఎస్ నేతల మధ్య చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో టిఎన్‌జిఓఎస్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, నగర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, విక్రమ్,తదితరులు ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు, జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి, ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆర్.డి.చంద్రశేఖర్, వై.నాగన్న గౌడ్, అదిల్ షరీఫ్, యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం మారం జగదీశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఐఎన్‌టియుసి నేతలు కార్మికుల అనేక సమస్యలను పరిష్కరించారన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరిస్తున్నందునే జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ టిఎన్‌జిఓఎస్ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. ముజీబ్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే టిఎన్‌జిఓఎస్ లక్ష్మమని, కార్మికుల సమస్యలపై ఐఎన్‌టియుసి పోరాడుతున్నందునే వారికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ కార్మికులకు అండగా నిలబడి, జలమండలి కార్మికుల సమస్యలు తొంభై శతం సమస్యలు పరిష్కరించమని, ఇకముందు వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ మద్దతు ప్రకటించిన టిఎన్‌జిఓఎస్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు ఈ.చంద్రశేఖర్, బి.జైరాజ్, బి.శంకర్ ప్రకాష్, సైద్ హాసిం, ఇందూరి తిరుపతి, గౌస్ పాషా, బి. అశోక్, నరసింహారెడ్డి, సిహెచ్. ప్రవీణ్ కుమార్, బి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.



జలమండలి ఎన్నికలపై సంయుక్త సమావేశంలో పాల్గొన్న ఐఎన్‌టియుసి నేత మొగుళ్ళ రాజిరెడ్డి, టిఎన్‌జిఓఎస్ నేతలు మారం జగదీశ్వర్, ముజీబ్ తదితరులు

అధికారులు న్యాయం చేయకపోతే బస్ భవన్ ఎదుట దీక్ష చేపడతా

సైఫాబాద్, మే 21 ప్రభాతవార్త: ఆర్టీసీ అధికారులు తనకు న్యాయం చేయకపోతే నగరంలోని బస్ భవన్ ఎదుట భార్యతోసహా నిరాహార దీక్ష చేపడతానని టిజిఎస్‌ఆర్‌టిసి బిసి ఎంప్లాయిస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఇ.అంజయ్య తెలిపారు. తనకు విధులు కేటాయించకుండా ఏలాంటి కారణం లేకుండా బదిలి చేసి, గత 5 నెలలుగా వేతనాలు చెల్లించకుండా అధికారులు మానసికంగా తనని వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అంజయ్య మాట్లాడుతూ గత జనవరి మాసంలో మేడారం జాతరలో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న పలు ఇబ్బందులపై ఒక టివి ఛానల్‌కు తెలియజేడం జరిగిందన్నారు. దీంతో 5 గురు ఆర్టీసీ అధికారులు తనపైన కక్షగట్టి డిప్యూటేషన్‌పై వచ్చిన తనని హైదరాబాద్‌లోని పికెట్ డిపో నుంచి కరీంనగర్ రిజినల్‌కు మార్చారని ఆయన ఆరోపించారు. అక్కడ రీజినల్ అధికారి తనకు విధులు కేటాయించకుండా మానసికంగా వేధింపులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్యకు తారనాకలోని ఆర్టీసీ ఆసుపత్రిలో కంటికి శస్త్ర చికిత్స చేయాల్సి ఉందని, హాస్పటల్ అధికారులు డిపో నుంచి లేటర్ తీసుకురమ్మన్నారని ఆయన చెప్పారు. లేటర్ ఎవరూ ఇచ్చే పరిస్థితిలో లేరని, వీటికి ఆర్‌టిసీ ఎండి, అధికారులు మీడియా ముందుకు వచ్చి సమాధానం చెప్పాలని తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దీక్ష చేపడతానని ఆయన హెచ్చరించారు.

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి పాటుపడతా

టిపిసిసి ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆరేపల్లి రాజేందర్

డాక్టర్ ఆరేపల్లి రాజేందర్‌ను సత్కరిస్తున్న మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, భరతభూషణ్, జేబీ రాజు, వీరస్వామి తదితరులు

చిక్కడపల్లి, మే 21 ప్రభాతవార్త : షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడతానని టీపీసీసీ ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆరేపల్లి రాజేం దర్ తెలిపారు. షెడ్యూల్డ్ కులాల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. గురువారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బందు సొసైటీ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి అధ్యక్షతన డాక్టర్ ఆరేపల్లి రాజేందర్ ఆత్మీయ సత్కారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, అప్పికట్ల భరత్ భూషణ్, జేబీ రాజులు హాజరై డా.రాజేందర్ ను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ, డాక్టర్ రాజేందర్ ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరి రెండు దశాబ్దాలుగా పార్టీ పటిష్టతకు సేవలందిస్తున్నారని ప్రశంసించారు. ఆయన చేసిన సేవలను కాంగ్రెస్ పార్టీ గుర్తించి ఎస్సీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గా నియమించడం అభినందనీయమన్నారు ఈ కార్యక్రమంలో బంధు సొసైట్ నాయకులు కనకయ్య, నర్సింగ్ రావు, రవీందర్, గౌతమ్ రాజు, రాజగోపాల్, లక్ష్మీనా రాయణ, గండి కృష్ణ, రాములు, మురళి, రత్నం, గొల్లపల్లి శ్రీధర్ రావు పాల్గొన్నారు.

ఉత్తమ కలెక్టర్ హరిచందనకు అభినందనలు



కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందనను అభినందిస్తున్న తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు, హైదరాబాద్ డిప్యూటీ లేబర్ కమిషనర్ బి.జానన్

చిక్కడపల్లి, మే 21 (ప్రభాతవార్త): కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందన తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు, హైదరాబాద్ డిప్యూటీ లేబర్ కమిషనర్ బి.జానన్ గురువారం గురువారం సచివాలయంలో సన్మానించారు. జాతీయ స్థాయిలో 800 జిల్లాల కలెక్టర్ల పనితీరు ఆధారంగా ఉత్తమ కలెక్టర్ ను ఎంపిక చేశారు. హరిచందన నెల కిందట వరకు హైదరా బాద్ జిల్లా కలెక్టర్గా పని చేశారు. అప్పుడు ఆమె పనితీరు ఆధారంగా ఉత్తమ కలెక్టర్ గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమెను జానన్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జానన్ మాట్లాడుతూ హరిచందన కలెక్టర్ హైదరాబాద్ ఉన్నతస్థాయిలో పనిచేశారని అన్నారు. కార్మిక శాఖ అధికారులు పవన్ రజని, జ్యోతి పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలిక...అప్పగించిన పోలీసులు

బాలికను తండ్రికి అప్పగిస్తున్న ఎస్ఐ నాగరాజ్‌రెడ్డి

చాంద్రాయణగుట్ట, మే 21, ప్రభాతవార్త : తప్పిపోయిన నాలుగేళ్ల బాలికను పోలీసులు వెతికిపట్టి సురక్షితంగా తండ్రికి అప్పగించారు. బండ్లగూడ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు... బండ్లగూడ గౌస్‌నగర్ వాడి ఏ అహ్మద్ కాలనీకి చెందిన మాంసం కోసే పనిచేసే ముహమ్మద్ అస్లం భార్య తబస్సుం బేగం తన నాలుగేళ్ళ కూతురు ఐరా తస్కిన్ ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ ఆర్.దేవేందర్ వెంటనే స్పందించి ఎస్ఐ ఎస్. నాగరాజ్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రవి, ముఖేష్‌లను రంగంలోకి దించారు. బాలిక కుటుంబం నివసించే బస్తీలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తూనే మరోవైపు స్థానికులతో తప్పిపోయిన బాలిక ఆచూకి కోసం ఆరా తీశారు. చివరకు ఆ సమీపంలోని కాలనీలో బాలిక ఆచూకిని కనుగొన్నారు. తల్లిదండ్రులు తెలిపిన వివరాలతో సంతృప్తి చెందిన పోలీసులు బాలికను క్షేమంగా తండ్రి ముహమ్మద్ అస్లంకు అప్పగించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. చిన్న పిల్లల సంరక్షణ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు పోలీసులు మార్గదర్శనం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

చాంద్రాయణగుట్ట, మే 21, ప్రభాతవార్త : ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఛత్రినాక సబ్ ఇన్‌స్పెక్టర్ త్రిమూర్తులు కథనం ప్రకారం...ఉప్పుగూడ ఆర్యూబీ పైభాగంలో 40-45 ఏళ్ళ వయస్సు గల వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని గమనించిన పెట్రోలింగ్ సిబ్బంది విషయాన్ని స్టేషన్ అధికారులకు తెలియజేశారు. వారి సూచన మేరకు అత్యవసర వైద్యసేవల సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వైద్య సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సదరు వ్యక్తిని పరిశీలించగా అతడు అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వివరాల కోసం సమీపంలోని వారిని వాకాబు చేయగా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుని వంటిపై నీలం, ఎరుపు రంగు షర్టు, నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, అతని వివరాలు తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాళేశ్వరం సరస్వతి అంత్య పుష్కరాలకు టూర్ ప్యాకేజీ

కంటోన్మెంట్, మే 21 ప్రభాతవార్త: ఈనెల 21 నుంచి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరం వద్ద సరస్వతి అంత్య పుష్కరాలు జరుగుతున్న సందర్భంగా ఆర్‌టీసీ రాణిగంజ్ డిపో టూర్ ప్యాకేజీ నడపడానికి నిర్ణయించింది. ఈనెల 23,24 తేదీలలో ప్యాకేజీ అందుబాటులో ఉంటుందని, 40 మంది కలిసి బస్సును బుక్ చేసుకోవచ్చని డిపో మేనేజర్ ఏ.శ్రీధర్ తెలిపారు. బస్సు మీ కాలనీకే వస్తుందని తెలియజేశారు. టికెట్ ధర ఒక్కొక్కరికి రూ. 1400 ఉంటుందని తెలిపారు. బస్సు ఉదయం 5గంటలకు బయలుదేరి రాత్రి 11గంటలకు ప్రయాణం ముగుస్తుందని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవలని కోరారు.

మాట్లాడుతున్న బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి

పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్ వద్ద బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నల్లజెండాలతో భారీ నిరసన చేపట్టారు. రోడ్డుపై బైటాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెరిగిన పెట్రోల్, డీజల్ ధరలతో సామాన్యులపై మోయలేని భారం పడుతుందన్నారు. పేదలపై ప్రభుత్వాలు భారాలు మోపుతూ నడ్డివిరుస్తున్నాయన్నారు. కేంద్రసర్కార్ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడమే భారంగా పెట్టుకుందని మండిపడ్డారు. పెంచిన ధరలు తగ్గించకుంటే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాజనర్సు, సాయిరాం, నాగరాజురెడ్డి, కలకుంట్ల మల్లికార్జున్, సాయన్నగారి సుందర్, మోహన్‌లాల్, కాముని నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి

తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు

మాట్లాడుతున్న శ్రీహరిరావు

సిద్దిపేట రూరల్, మే 21, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తుందని పద్దతి మార్చుకోవాలని తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని బూర్గుపల్లి పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాన్ని గురువారం సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటను అమ్ముకోవడానికి రోజుల తరబడి మార్కెట్‌యార్డులు, కొనుగోలు కేంద్రాలలో పడిగాపులు కాస్తున్నారని వాపోయారు. కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలన్నారు. ఆయన వెంట వెంకట్రామ్‌రెడ్డి, పోతుగంటి రవీందర్‌రెడ్డి, రామలింగారెడ్డి, మారెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి సంతోష్ ఉన్నారు.

ప్రతి ఒక్కరూ జనగణనలో పాల్గొనాలి

కొండపాక, మే 21, ప్రభాతవార్త : భారత జనగణనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిస్తు గురువారం కుకునూరుపల్లిలో జిల్లా కలెక్టర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బిజ్జురి రవి కుమార్ ఆదేశాల మేరకు కళా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జనగణన 2026లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, సామాజిక సంక్షేమం, ప్రాంతీయ అవసరాల గుర్తింపు, భవిష్యత్ ప్రణాళిక, కుటుంబసభ్యుల వివరాలు, నివాస పరిస్థితుల వివరాలు తప్పకుండా ఇవ్వాలని, ఆటపాటలతో కళాప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దండి సుజాత, సర్పంచ్ మల్లం కనకవ్వ ఐలయ్య, కార్యదర్శి స్వప్న, ఎన్యూమరేటర్లు, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అదే విధంగా కొండపాక గ్రామంలో సైతం కళా ప్రదర్శన నిర్వహించారు. కళా ప్రదర్శనలో టీం లీడర్ పిల్లిట్ల శ్యాం సుందర్, సనువాల కనకయ్య, గెంటె హరిప్రసాద్, తండ బిక్షపతి, పిన్నింటి రత్నం, పన్నీరు శ్రీనివాస్, ఎల్ల సిద్దులు, రాచపల్లి శైలజ పాల్గొని కళా ప్రదర్శన నిర్వహించారు.

గౌరవెల్లి రిజర్వాయర్ కట్టపై సిసి కెమెరాల ఏర్పాటు

అక్కన్నపేట, మే 21, ప్రభాతవార్త : అక్కన్నపేట మండలం గౌరవెల్లి రిజర్వాయర్ కట్టపై గురువారం ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డ్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల జీఆర్ఎంబీ అధికారులు రిజర్వాయర్‌ను పరిశీలించిన సందర్భంగా, ఆకతాయిలకు అందకుండా ఎత్తైన ప్రదేశాల్లో కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించినట్లు వెల్లడించారు. దీంతో రిజర్వాయర్ కట్టపై దాదాపు 9 సీసీ కెమెరాలను అమర్చినట్లు తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన కొన్ని కెమెరాలు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించడంతో ఈసారి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఇకపై రిజర్వాయర్ కట్టపై పోలీసుల పర్యవేక్షణ కూడా నిరంతరం కొనసాగుతుందని, పోలీస్ శాఖకు లేఖ రాసి నిఘా మరింత పెంచే చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే


కలెక్టర్‌తో సమావేశమైన సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 21, ప్రభాతవార్త: నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గురువారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు అభివృద్ధి, రైతు, తాగునీరు, రోడ్లు, భవనాలు, విద్య, విద్యుత్ తదితర అంశాలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వెంట బిఆర్ఎస్ నాయకులు జయపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కోటి ఇవ్వకపోతే క్వారీ మూసేస్తామంటూ బెదిరింపులు

–క్వారీలోకి వెళ్లి క్రషర్ మిషన్లు నిలిపివేత

జిన్నారం, మే 21, ప్రభాతవార్త: జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలో ఉన్న బిల్డ్‌మేట్ మెటల్ అండ్ సాండ్ ఇండస్ట్రీస్ క్వారీలో కొందరు వ్యక్తులు వెళ్లి హంగామా చేసిన ఘటన పై బొల్లారం పోలీసులు కేసు నమోదు చేశారు.

సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖాజీపల్లి గ్రామానికి చెందిన అరికెల సురేష్, అరికెల మహేష్, కుమ్మరి జితేందర్, రమేశ్‌తో పాటు మరికొందరు ఈ నెల 18న క్వారీలోకి వెళ్లినట్లు తెలిపారు. అక్కడ పని చేస్తున్న కార్మికులను బెదిరించడంతో పాటు క్రషర్ మిషన్లను నిలిపివేయించినట్లు పేర్కొన్నారు. అనంతరం క్వారీ యజమానికి ఫోన్ చేసి తాము ఇటీవల ఎన్నికైన నాయకులమని, తమకు కోటి రూపాయలు ఇవ్వకపోతే క్వారీ మూసివేస్తామని హెచ్చరించినట్లు వెంకట ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదులో తెలిపినట్లు వివరించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు. పరిశ్రమలు, క్వారీలు, క్రషర్లు నిర్వహిస్తున్న యాజమాన్యాలు ఎలాంటి బెదిరింపులు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్వర్గీయ రాజీవ్‌గాంధీకి ఘన నివాళులు

నివాళులర్పిస్తున్న నాయకులు

నివాళులర్పిస్తున్న కప్పర భానుప్రకాష్‌రావు

నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్

కొమురవెల్లిలో నివాళులర్పిస్తున్న దృశ్యం

సంగారెడ్డి మున్సిపాలిటీలో...

సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 21, ప్రభాతవార్త: మాజీప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని సంగారెడ్డిలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాంగ్రెస్‌పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు టిజిఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి హాజరయ్యారు. రాజీవ్ పార్క్ సమీపంలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులుర్పించారు. ఈసందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనితసంతోష్, నాయకులు అనంతకిషన్, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో...

గజ్వేల్ టౌన్, మే 21, ప్రభాతవార్త: గజ్వేల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి యువజన కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గ మాజీఅధ్యక్షులు, తీగుల్ మాజీసర్పంచ్ కప్పర భానుప్రకాష్‌రావు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాచారం దేవస్థాన డైరెక్టర్ శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బునారి రాజు, నాయకులు జయల వేణు గోపాల్, యువజన కాంగ్రెస్ నాయకులు నవీన్ గౌడ్, మంగలి యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో...

హత్నూర, మే 21, ప్రభాతవార్త: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హత్నూర మండలం దౌల్తాబాద్‌లో గురువారం నిర్వహించారు. స్థానికంగా ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి షాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్‌జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి హాజరై పార్టీనాయకులతో కలిసి రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కరే కృష్ణ, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కొన్యాల వెంకటేశం, నర్సింహారెడ్డి, దుర్గారెడ్డి, తలారి రాజేందర్, శ్రీహరి, కృష్ణ, రంజిత్‌రెడ్డి, యాదగిరి, చార్ల మణిదీప్, ఎండి గౌస్, సాయి కుమార్, సురేందర్‌రెడ్డి, సోహెల్ పాల్గొన్నారు.

సిద్దిపేటలో...

సిద్దిపేట రూరల్/కొమురవెల్లి/చిన్నకోడూరు, మే 21, ప్రభాతవార్త: రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా రాజీవ్‌రహదారి సమీపంలోని పొన్నాలజంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం, జిల్లా ఆర్టీఏసభ్యులు డాక్టర్ లక్కరసు సూర్యచంద్ర వర్మలు పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మంద పాండు, సదాశివారెడ్డి, దేవయ్య, బాబు, రమేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో...

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు బుడిగె జహంగీర్ గౌడ్, జక్రిపోతుల నర్సింలు, ఏర్పుల కళ్యాణి కృష్ణ, మల్లం బాలయ్య, గొల్లపల్లి కనకయ్య, బుడిగే అశోక్, గుంగుల ఐలయ్య, నరెడ్ల బాల్‌రెడ్డి, వంశీకృష్ణ, రాజు, నర్సింలు, రమేష్ పాల్గొన్నారు.

చిన్నకోడూరులో...

చిన్నకోడూరులోని మార్కెట్‌కమిటీ కార్యాలయంలో ఎఎంసి చైర్మన్ మీసం మహేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించి ఆయన దేశానికి, పేదలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్‌చైర్మన్ బుస్సా రాజశేఖర్, డైరెక్టర్లు వినోద్, రాజవర్ధన్‌రెడ్డి, మైపాల్ రెడ్డి, తాళ్లపల్లి రాజు, కరుణాకర్, నాగరాజు, పార్టీ నాయకులు ప్రశాంత్, గణేష్, శేఖర్, ఎల్లయ్య, చందు, స్వామి, రాకేష్, ఎల్లయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో...

నర్సాపూర్, మే 21, ప్రభాతవార్త: మాజీప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్‌నాయకులు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మెదక్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయాలసంస్థ చైర్‌పర్సన్ చిలుముల సుహాసినిరెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజుయాదవ్‌లతోపాటు కాంగ్రెస్‌శ్రేణులు అందరూ కలిసి నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్చార్జ్ రాజిరెడ్డి, గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ చిలుముల సుహాసినిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్, ప్రధానకార్యదర్శి శ్రవణ్ కుమార్, కార్యదర్శి రవీందర్‌యాదవ్, నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షులు రిజ్వాన్, హత్నూర మండలం అధ్యక్షులు కృష్ణ, రెడ్డిపల్లిసర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్, దాడిగా నరేష్, శివగౌడ్, సుధీర్‌కుమార్‌గౌడ్, రశీద్, ఆంజనేయులు, నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అమర్నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడిగా నందిని శ్రీనివాస్

సిద్దిపేట రూరల్, మే 21, ప్రభాతవార్త : అమర్నాథ్ అన్నదాన సేవా సమితి నూతన అధ్యక్షుడిగా నందిని శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమితి నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ కలిసికట్టుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమితి ప్రతినిధులు తెలిపారు. సమావేశానికి కాచం కాశీనాథ్ సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ఎన్నో ఏళ్లుగా అమర్నాథ్ యాత్రికులు, పేదలకు సమితి అందిస్తున్న సేవలను కొనియాడారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నందిని శ్రీనివాస్‌కు సభాధ్యక్షులు కాచం కాశీనాథ్‌తోపాటు సమితి సభ్యులు శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా నందిని శ్రీనివాస్ మాట్లాడుతూ, తనపై విశ్వా సం ఉంచి బాధ్యతను అప్పగించిన సమితిసభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చేతికి అందేంత ఎత్తులో విద్యుత్ వైర్లు..

–అధికారుల నిర్లక్ష్యంపై తండావాసుల ఆగ్రహం

కిందికి వేలాడున్న విద్యుత్ వైర్ల దృశ్యం

అక్కన్నపేట, మే 21, ప్రభాతవార్త: అక్కన్నపేట మండలం పంతులు తండా గ్రామపంచాయతీ పరిధిలోని తారాచంద్ తండాలో నివాస గృహాలపై నుంచి వెళ్లే విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. తండాకు చెందిన లావుడ్య ఈరానాయక్ ఇంటిపైనుంచి వెళ్లే విద్యుత్‌లైన్లు చేతికి అందేంత ఎత్తులో ఉండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఈవిషయమై బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు రాతపూర్వకంగా, ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటిచర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. గాలివాన సమయంలో పరిస్థితి మరింతప్రమాదకరంగా మారుతోందని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేలాడుతున్న విద్యుత్ తీగలను వెంటనే సరిచేసి ప్రమాదాన్ని నివారించాలని స్థానికుడు తిరుపతినాయక్ డిమాండ్ చేశారు. ఇదేకాకుండా వ్యవసాయబావుల దారుల్లో కూడా విద్యుత్‌తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తండావాసులు ఆవేదన వ్యక్తంచేశారు.

ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది

–మాజీమంత్రి డాక్టర్ ఎ.చంద్రశేఖర్

ఓటరు జాబితాను ఆర్డీవో అధికారులకు అందజేస్తున్న మాజీ మంత్రి

జహీరాబాద్, మే 21, ప్రభాతవార్త: జహీరాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ స్టేషన్లు, ఆయా ప్రాంతాల బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాను మాజీమంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్ గురువారం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఎన్నికల అధికారికి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కండేం నర్సింలు, మొగుడంపల్లి మండల అధ్యక్షుడు మక్సూద్ అహ్మద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామేల్, మాజీ వైస్‌చైర్మన్ ఖాజా, టిపిసిసి కోఆర్డినేటర్ గౌస్, కౌన్సిలర్ మహేష్, సర్పంచ్ రాజు, ఎఎంసి డైరెక్టర్ శేఖర్, కాంగ్రెస్ నాయకులు హుగ్గెల్లి రాములు, నయీమ్, మొయిజ్ గౌస్, అయూబ్, అడ్వకేట్ వాజహత్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు

–మాజీ మంత్రి డా.ఎ.చంద్రశేఖర్ నివాళి

జహీరాబాద్, మే 21, ప్రభాతవార్త: స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతిని గురువారం జహీరాబాద్ పట్టణంలోని సుభాష్‌గంజ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా.ఎ.చంద్రశేఖర్ పాల్గొని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మున్సిపల్ కార్యాలయ కార్మికులకు చీరలు పంపిణీచేశారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, ఆహారపదార్థాలు అందజేశారు. ఐబి గెస్ట్‌హౌస్‌వద్ద యువజనకాంగ్రెస్ ఆధ్వర్యంలో అన్నదానకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ ఎండి యూనుస్, వైస్‌చైర్మన్ కొత్త కాపు శిరీష సురేందర్‌రెడ్డి, పట్టణకాంగ్రెస్ అధ్యక్షుడు కండేం నర్సింలు, మొగుడంపల్లి మండలాధ్యక్షుడు మాక్సూద్‌అహ్మద్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు సామెల్, మాజీవైస్‌చైర్మన్ ఖాజా, కౌన్సిలర్లు జామిలోద్దీన్, మహేష్, జహంగీర్ అతీక్, ఎఎంసి డైరెక్టర్ శేఖర్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్లకు ఎమ్మెల్యే సునీతారెడ్డి శంకుస్థాపన


సిసి రోడ్లకు శంకుస్థాపనచేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డితోపాటు సర్పంచ్ వర్షసుదీప్ తదితరులు

నర్సాపూర్, మే 21, ప్రభాతవార్త : నర్సాపూర్ మండలపరిధిలోని రుస్తుంపేట గ్రామంలో గురువారం ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. ఈసందర్భంగా సర్పంచ్ వర్షసుదీప్, ఆత్మకమిటీ మాజీచైర్మన్ శివకుమార్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు అయ్యాయి. గ్రామంలో10 లక్షల ఎస్సీ సిఆర్ఆర్ ఫండ్‌తో 2వ వార్డ్, 3వ వార్డ్‌ల్లో సిసి రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు కాగా, ఎంజిఎన్ఆర్ఈజిఎస్ గ్రాంట్ 3 లక్షలు నిధులతో 4వ వార్డ్‌లో నిర్మాణం చేయనున్న సిసి రోడ్లకు ఎమ్మెల్యే సునీతారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమెమాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణాలను నాణ్యతగా పటిష్టంగా నిర్మించాలని సూచించారు. ఇంకా గ్రామంలో ఎక్కడైనా సిసి రోడ్లు అవసరం ఉన్నచో వాటికి కూడా నిధులు మంజూరుచేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఆత్మకమిటీ చైర్మెన్ ఈటూరి శివకుమార్, గ్రామ సర్పంచ్ ఈటూరి వర్షసుదీప్, ఉపసర్పంచ్ మరికింది వీరేశం, వార్డు సభ్యులు గొల్ల పద్మకృష్ణ, సందిల సులోచనమద్నయ్య, గద్దమిడి పెంటేష్, మన్నె శేఖర్, మద్దికుంట నరేష్, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన నర్సారెడ్డి

గజ్వేల్ టౌన్, మే 21(ప్రభాతవార్త): గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తేరాల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి గురువారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే కొడకండ్ల గ్రామానికి చెందిన బెజగామ నర్సమ్మ, గజ్వేల్ మాజీ వార్డు సభ్యుడు జి.పరమేశ్వర్‌చారి తల్లి లక్ష్మిలు అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

మర్కుక్, మే 21 (ప్రభాతవార్త): 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం గణేష్‌పల్లిలోగల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ రామరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి 50 క్వింటాళ్ల జనుము, 100 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు కేటాయించగా, ప్రస్తుతం 54.80 క్వింటాళ్ల జనుము అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. జనుము 40 కేజీల బస్తా రైతులకు రూ.3,110, జీలుగ 30 కేజీల బస్తా రూ.2452కు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంటిమామిడి ఏఎంసి చైర్మన్ విజయ మోహన్, అంగడికిష్టాపూర్ సర్పంచ్ కొండల్‌రెడ్డి, ఏఓ రాము, ఏఈవో విష్ణు, మాజీ జెడ్‌పిటిసి రామచంద్రం, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కనకయ్యగౌడ్, అంగడికిష్టాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, రైతులు బాల్‌నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కుకునూరుపల్లిలో...

కొండపాక, మే 21, ప్రభాతవార్త : పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయడం ద్వారా నేల భూసారం పెరిగి పంట అధిక దిగుబడులు పొందవచ్చని కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం కుకునూరుపల్లి మండల కేంద్రంలోని అగ్రోస్ రైతు సేవ కేంద్రంలో వ్యవసాయధికారి గోవిందరాజుతో కలిసి రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేసి మాట్లాడారు. 50 శాతం రాయితీపై పచ్చిరొట్టన జనుము విత్తనాలు రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. జనుము విత్తనాలు 45 క్వింటాళ్ళు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం ఎఓ మాట్లాడుతూ జనుము 40 కిలోల బస్తా దర రూ॥ 3100 చెల్లించి జనుము విత్తనాలు పొందవచ్చునన్నారు. రైతులు అధార్ కార్డు, భూమి పట్టా పాస్‌బుక్, ఫోన్ నెంబర్ తప్పకుండా అగ్రో కేంద్రనికి తీసుకురావాలని అయన సూచించారు. అదే విధంగా కొండపాక మండల పరిధిలోని వెలికట్ట క్రాస్‌రోడ్డులో ఉన్న అగ్రో రైతు సేవ కేంద్రంలో సైతం అయన జనుము విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పొద్దటూరి శ్రీనివాస్, ముద్దాపూర్ సర్పంచ్ తూం శ్రీకాంత్‌రెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ అమరేందర్, పిఎసిఎస్ డైరెక్టర్ నర్సింహ్మాచారి, నాయకులు మల్లం ఐలయ్య, రెడ్డమైన రవీందర్, ఇండ్ల కనకయ్య, ఎఈఓలు, వెలికట్టలో అయన వెంట ఎఓ శివరామక్రిష్ణ, అంకిరెడ్డిపల్లి సర్పంచ్ గాలి బాలయ్య, నాయకులు వాసరి లింగరావు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజయ్యది సర్కారు హత్యే

–మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

చిన్నశంకరంపేట, మే 21, ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యధోరణి మూలంగానే రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. చిన్నశంకరంపేట మండల పరిధి గవ్వపల్లి పంచాయతీ అగ్రహారం గ్రామానికి చెందిన రైతు రాజయ్య ఆర్థిక ఇబ్బందులకుతోడు చేసిన అప్పులు, ధాన్యం అమ్ముడు పోక బుధవారం ఆత్మహత్యకు పాల్పడిన సంగతి పాఠకులకు విదితమే. ఈవిషయం తెలుసుకున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి గురువారం రాజయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం సకాలంలో లారీలను పంపించి ధాన్యాన్ని తరలించి ఉంటే రైతు రాజయ్య ఆత్మ హత్య చేసుకుని ఉండేవాడు కాదన్నారు. ఇది కచ్చితంగా కాంగ్రెస్ సర్కా రు చేసిన హత్యే అని ఆరోపించారు. అంబాజీపేట కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలుపేరుకుపోయాయని నెలరోజులుగా లారీలురాక అన్నదాత లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని, ఈవిషయంపై ప్రభుత్వంపైపోరాడుదామని అన్నారు. ఆమెవెంట బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు, నరేష్, శ్రీనివాస్ తదితరులున్నారు.

మహాదేవపురం కాలనీలో

విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు కోసం వినతి

పేట్ బషీరాబాద్, మే 21, ప్రభాతవార్త

మహాదేవపురం కాలనీలోని ఎస్ అండ్ పి బ్లాక్ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో సరైన వెలుతురు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రాత్రి సమయంలో భద్రతా సమస్యలు ఎదురవుతున్నాయని నాయకులు వివరించారు. వెంటనే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరా రు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ అవిజె జేమ్స్, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

కుర్చీ తాత మహ్మద్ పాషా మృతి.. అభిమానుల్లో విషాదం

సంజీవరెడ్డి నగర్, మే 21, ప్రభాతవార్త: సోషల్ మీడియాలో కుర్చీ మడతపెట్టి.. డైలాగ్‌తో విపరీతమైన గుర్తింపు తెచ్చుకున్న మహ్మద్ పాషా ఇకలేరు. తన ప్రత్యేక మాటతీరు, వినూత్న శైలితో లక్షలాది మందిని అలరించిన ఆయన మృతి అభిమానులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. నగరంలోని కృష్ణకాంత్ పార్కులో వాకింగ్ చేస్తుండగా మహ్మద్ పాషా ఆకస్మికంగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు. వెంటనే ఆయనను సమీప ఆసుపత్రికి తరలించినప్పటికీ వైద్యులు ప్రాణాలు కాపాడలేకపోయారు. జవహర్ నగర్ సాయిబాబా ఆలయం సమీపంలో నివాసముంటున్న మహ్మద్ పాషా సోషల్ మీడియాలో కుర్చీ తాతగా విపరీ తమైన ప్రజాదరణ పొందారు. సాధారణ వ్యక్తిగా ప్రారంభమైన ఆయన వీడియోలు ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి.ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే అభిమానులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాం తి వ్యక్తం చేశారు. మహ్మద్ పాషా ఆత్మకు శాంతి చేకూరాలని వాయిస్ ఆఫ్ ది పీపుల్ న్యూస్ తరఫున ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

బిజెపి నాయకుడిని పరామర్శించిన సీనియర్ నేత

కెపిహెచ్‌బి కాలనీ, మే 21, ప్రభాతవార్త

మూసాపేట డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు నవీన్‌గౌడ్ నడుము నొప్పితో బాధపడుతూ శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం చికిత్స పొందుతున్న విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసు కున్న కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురువారం నవీన్ నివాసానికి వెళ్లి ఆయ నను పరామర్శించారు. ఈ సందర్భంగా నవీన్ ఆరోగ్య పరిస్థితిని, చికిత్స వివరాలను తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, త్వరలోనే పూర్తిగా కోలుకుంటారని ధైర్యం చెబుతూ ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీనియర్ బీజేపీ నాయకులు కర్కాడాకయ్య, ఐలయ్య యాదవ్, శ్రీనివాస్, రవికుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జనగణన ఏర్పాట్లపై జోనల్ కమిషనర్ సమీక్ష

దుండిగల్, మే 21, ప్రభాతవార్త

కుత్బుల్లాపూర్ జోన్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ గురువారం దుండిగల్ సర్కిల్‌ను సందర్శించి జనగణన కార్యక్రమంపై నోడల్ అధికారులు, సూపర్వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయడం, పర్యవేక్ష ణను కట్టుదిట్టం చేయడం, సమాచారం కచ్చితంగా నమోదు చేయ డం వంటి అంశాలపై అధికారులకు కీలక సూచనలు చేశారు. అనంతరం జోనల్ కమిషనర్ ఫీల్డ్ స్థాయిలో తనిఖీలు నిర్వహించి ఎన్యూమరేషన్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. సర్వే పనులు సమర్థవంతంగా, ఖచ్చితత్వంతో జరుగుతున్నాయా అనే అంశాలను పరిశీలించి సిబ్బందికి తగిన మార్గ దర్శకాలు అందించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్ వెంకట మణి కరణ్, ఏఎంసీ లక్ష్మయ్య, ఏసీపీ శ్రీనివాస్, డిప్యూటీ ఈఈ అన్వేష్ రెడ్డి,ఏఈ సురేందర్ నాయక్,సెన్సస్ సూపర్వైజర్లు, పాల్గొన్నారు.

నేత్రపర్వంగా నల్లపోచమ్మ జాతర

-అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

నల్లపోచమ్మ అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తుల దృశ్యం

మనూర్, మే 21, ప్రభాతవార్త:

మండలపరిధిలోని బోరంచగ్రామంలో కొలువున్న శ్రీనల్లపోచమ్మ ఆలయంలో 7వారాల జాతర నేత్రపర్వంగా కొనసాగుతుంది. గురువారం 5వ వారం ఉత్సవాలకు మండలంలోని ఆయాగ్రామాలతో పాటు పరిసర మండలాలు, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతం భక్తులతో జనసంద్రంగా మారింది. ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ అర్చకులు శ్రీకాంత్, సిద్ధు, నాగయ్య, ప్రవీణ్‌లు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయ పరిసరాల్లో ఎస్ఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో నిఘా ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీల్లో జొన్నల కొనుగోలుకేంద్రాలు

జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ జగన్నాథ్‌రెడ్డి

న్యాల్‌కల్, మే 21, ప్రభాతవార్త:

మండలకేంద్రమైన న్యాల్‌కల్‌తోపాటు మండలంలోని హద్నూర్ గ్రామంలోని సొసైటీకేంద్రంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్‌లు కాంగ్రెస్ నాయకులతో కలిసి జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాల్‌కల్, హద్నూర్ సొసైటీ చైర్మన్‌లు సిద్దలింగయ్యస్వామి, ఎక్కెల్లి జగన్నాథ్‌రెడ్డిలు మాట్లాడుతూ రైతులు పండించిన జొన్నలను మధ్య దళారులకు అమ్ముకుని ఆర్థికంగా ఆగంకావొద్దని, ప్రభుత్వం క్వింటాలు జొన్నలకు 3699 రూపాయలను మద్దతు ధరగా అందిస్తోందని గుర్తు చేశారు. జొన్నల కొనుగోలుకేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ జక్కుల హనుమంతు, ఎస్ఐ దోమ సుజిత్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, మండల యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు కిరణ్‌గౌడ్, డిసిసి బ్యాంక్ మేనేజర్ ధనుంజయ, ఆర్ఐ శ్యామ్‌రావు, బస్వరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేయండి

-మండల ఫర్టిలైజర్ డీలర్లతో ఎఈఎ నూతన్‌కుమార్

ఫర్టిలైజర్ డీలర్లకు సూచనలుచేస్తున్న ఎడిఎ నూతన్‌కుమార్

కంగ్టి, మే 21, ప్రభాతవార్త:

ఫర్టిలైజర్ డీలర్లు నిబంధనలు పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలని వ్యవసాయ సహాయసంచాలకులు నూతన్‌కుమార్, మండల వ్యవసాయాధికారి హరీస్‌పవార్‌లు అన్నారు. గురువారం మండలకేంద్రమైన కంగ్టిలోని రైతువేదికలో వ్యవసాయాధికారులు ఫర్టిలైజర్ డీలర్లతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఎడిఎ నూతన్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో ప్రారంభంకానున్న ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని రైతులకు ఎరువులు, విత్తనాలు అమ్మేతీరుపై దిశానిర్దేశం చేశారు. వ్యవసాయాధికారుల సూచనలు, నిబంధనలు అతిక్రమించిన డీలర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫర్టిలైజర్ ఎరువులను ఒకే కంపెనీవి కాకుండా గుర్తింపుపొందిన వివిధకంపెనీల ఎరువులను విక్రయించేలా చర్యలుతీసుకోవాలన్నారు. నానోడిఎపి, నానోయూరియాలు అవసరంమేరకు వాడుకోవాలని రైతులకు సూచించారు. కంగ్టి మండల రాష్ట్ర సరిహద్దులో ఉన్నందున పక్క రాష్ట్రానికి మన ఫర్టిలైజర్‌లు పంపవద్దని సూచనలు చేశారు.

కాంగ్రెస్ పాలనలోనే రైతుల ఆత్మహత్యలు

చిన్నశంకరంపేట, మే 21, ప్రభాతవార్త:

అసమర్థ కాంగ్రెస్ పాలనలోనే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మెదక్ నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి రమేష్‌గౌడ్, బట్టి అజయ్‌లు అన్నారు. అగ్రహారం గ్రామానికిచెందిన రైతు రాజయ్య ధాన్యం అమ్ముడుపోక బుధవారం ఆత్మహత్యకు పాల్పడగా, టిఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు కవిత ఆదేశాలమేరకు ఆపార్టీ నాయకులు రమేష్‌గౌడ్, అజయ్‌లు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చనిపోయిన రైతు రాజయ్య కుటుంబానికి కోటి రుపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని వారు డిమాండ్‌చేశారు. వారివెంట రమేష్ తదితరులున్నారు.

సింగూర్ నిల్వనీటి డ్యాం నిర్మాణస్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు

మనూర్, మే 21, ప్రభాతవార్త:

మండలపరిధిలోని రాయిపల్లిగ్రామ శివారులోని సింగూర్ నీటి నిల్వ కోసం ప్రతిపాదిత డ్యాం నిర్మాణ ప్రాజెక్టు పనుల్లో కీలక అడుగుపడింది. ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సూచనలమేరకు నీటిపారుదలశాఖ ఉన్నతాధికారుల బృందం రాయిపల్లి గ్రామాన్ని సందర్శించి డ్యాం నిర్మాణస్థలాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలు, నీటినిల్వ సామర్థ్యం, భూసేకరణ, డ్యాం డిజైన్‌లపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రాజెక్టుతో ప్రజలు సాగు, తాగు నీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజనీర్ రాజమ్మ, సూపరింటిండెంట్ రఘునాధరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుందర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జలేందర్, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రకాష్, మాజీసర్పంచ్ రాంచందర్, మాజీ ఎంపిటిసి సభ్యులు దోండి పటేల్, మాస్ పటేల్, రైతులు పాల్గొన్నారు.

పట్టపగలూ వెలుగుతున్న వీధి దీపాలు

-పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు

పట్టపగలే వెలుగుతున్న వీధి దీపం దృశ్యం

మొగుడంపల్లి, మే 21, ప్రభాతవార్త:

విద్యుత్ వృథా సరికాదని చెప్పే అధికారులు పట్టపగలు గ్రామాల్లోని వీధుల్లో విద్యుత్‌దీపాలు వెలుగుతున్నా పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో నిరంతరం రౌండ్ ద క్లాక్‌గా వీధిదీపాలు వెలుగుతున్నా పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోకపోవడం, విదుత్ అధికారులు అప్రమత్తం కాకపోవడంతో విద్యుత్ సరఫరా వృథా అవుతోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పట్టపగలు మండలంలోని ఆయాగ్రామాల్లో వీధిదీపాలు వెలుగుతుండటంతో వందలాది విద్యుత్‌యూనిట్‌లు వృథా అవుతున్నాయ. సంబంధిత అధికారులు స్పందించి పగటిపూట విద్యుత్‌దీపాలు వెలగకుండా చూసి విద్యుత్ వృథాకాకుండా చర్యలుతీసుకోవాలని మండలప్రజలు సూచిస్తున్నారు.

ఎంపిడిఓగా అహమ్మద్ హుస్సేన్

సిర్గాపూర్, మే 21, ప్రభాతవార్త:

మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా మహ్మద్ అహమ్మద్ హుస్సేన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండల అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహించిన శారదాదేవి ఫారెన్ సర్వీస్‌పై జిహెచ్ఎంసి హైద్రాబాద్‌కు బదిలీ కావడంతో మనూర్‌మండలంలో మండలపంచాయతీ అధికారిగా సేవలు అందచేస్తున్న మహ్మద్ అహమ్మద్ హుస్సేన్‌కు అదనపుబాధ్యతలు అప్పగించడంతో గురువారం మండలకేంద్రమైన సిర్గాపూర్‌లోని మండలపరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మహ్మద్ అహమ్మద్ హుస్సేన్‌ను కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. మండల అధికారుల, ప్రజాప్రతినిధుల, ప్రజల సహకారంతో మండలాభివృద్ధికి కృషిచేస్తానని మహ్మద్ అహమ్మద్ హుస్సేన్ తెలిపారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి



తహసీల్దార్ రజనీకుమారికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

రామాయంపేట, మే 21, ప్రభాతవార్త:

రామాయంపేట మండలం లక్ష్మాపూర్ శివారులోని కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని గ్రామస్థులు గురువారం స్థానిక తహసీల్దార్ రజనీకుమారికి వినతిపత్రం సమర్పించారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 243లో 12ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, 6ఎకరాలు ప్రభుత్వం నిరుపేదలకు అసైన్డ్ చేశారని, మరో 6ఎకరాల భూమి కబ్జాకుగురైందని తెలిపారు. ఈభూమిని అధికారులు స్వాధీనం చేసుకొని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని గ్రామస్థులు విజ్ఞప్తిచేశారు.

శ్రీలక్ష్మీ సుదర్శనయాగ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే

నారాయణఖేడ్, మే 21, ప్రభాతవార్త:

నారాయణఖేడ్ పట్టణంలో మల్కంచి గురురాజశర్మ నివాసంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న శ్రీమహతి జ్యోతిష్యాలయం శ్రీలక్ష్మీ సుదర్శనయాగ మహోత్సవం కార్యక్రమానికి హాజరై నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారితోపాటు సర్పంచులు ఈశ్వర్, కోణం అంజయ్య, కిషన్‌రావు, కోటగిరి శ్రీనివాస్, సంగయ్య, శ్రీకాంత్, మోలానా, పూజారులు భక్తులు తదితరులు ఉన్నారు.

గ్యాస్ సిలెండర్‌లకై బారులు తీరిన వినియోగదారులు

వుల్‌కల్, మే 21, ప్రభాతవార్త:

గ్యాస్ సిలెండర్‌లకోసం వినియోగదారులు పడిగాపులుకాస్తూ రోడ్డపై బారులుతీర్చిన దయనీయ దుస్థితి దాపురించింది. గ్యాస్ సిలెండర్‌ల సరఫరాలో అలాస్యమో, కొరతనో తెలియదు కాని వినియోగదారులు మాత్రం సరైన సమయంలో సిలెండర్‌లు అందుకోలేకపోతున్నారు. మండల పరిధిలోని గొంగ్లూర్‌లో భారత్‌గ్యాస్ ఏజెన్సీ వద్ద ఉదయం 4గంటల నుంచి వినియోగదారులు ఖాళీ గ్యాస్ సిలెండర్‌లతో బారులుతీరుతున్నారు. బుధవారం అర్ధరాత్రి భారత్ ఏజెన్సీకి స్టాక్ వచ్చినట్లు తెలుసుకున్న వినియోగదారులు తెల్లవారుఝాము నుంచే ఏజెన్సీ దుకాణం వద్ద బారులుతీరారు. గ్యాస్ బుక్‌చేసి రోజులు గడుస్తున్నా, ఓటిపి రావడం లేదని, ఓటిపిలు వస్తే స్టాక్‌లేదని ఏజెన్సీ వారు బుకాయిస్తున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గ్యాస్ కొరతలేదని ఏజెన్సీవారు వివరణ ఇస్తున్నా, తమకుమాత్రం గ్యాస్ అందించడంలేదని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గ్యాస్ సిలెండర్‌లు పక్కదారి పట్టిస్తూ బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తుండటంతోనే సమస్య వస్తోందని వినియోగదారులు అనుమానం

గ్యాస్ సిలెండర్‌ల కోసం బారులుతీరి పడిగాపులు పడుతున్న వినియోగదారులు

వ్యక్తంచేస్తున్నారు. గ్యాస్ బుక్‌చేసుకున్న వినియోగదారులకు ఆటోలో సిలెండర్‌లను సరఫరాచేస్తున్నామని ఏజెన్సీ నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఆటోలో సిలెండర్‌లను గ్రామానికి సరఫరా చేస్తే తామెందుకు తెల్లవారుఝామున ఖాళీ సిలెండర్‌లను పట్టుకుని రోడ్లపై ఎందుకు బారులుతీరుతామని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. గొంగ్లూర్‌లోని ఏజెన్సీలోని రికార్డులను సివిల్ సప్లై అధికారులు తనిఖీచేసి మండలంలో గ్యాస్‌కొరత ఏర్పడకుండా చర్యలుతీసుకోవాలని డిమాండ్‌చేస్తున్నారు.

ఐటి విప్లవాన్ని పరిచయం చేసిన మహనీయుడు రాజీవ్ గాంధీ

-రామాయంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్యనాగరాజు

రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

రామాయంపేట, మే 21, ప్రభాతవార్త:

దేశానికి ఐటి విప్లవాన్ని పరిచయం చేసిన మహనీయుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని రామాయంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్యనాగరాజు కొనియాడారు. మున్సిపాలిటీ పరిధిలో గురువారం రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మెదక్ చౌరస్తాలో ఆయనచిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీతగణేష్, కౌన్సిలర్స్ గజవాడ నాగరాజు, పుట్టి సందీప్, దేవుని రంజిత్, దాకి శ్యామలస్వామి, బైరం స్వప్నకుమార్, కోఆప్షన్ మెంబర్స్ దేమే యాదగిరి, గౌస్, చింతల రాధాభవానియాదగిరి, పట్టణ అధ్యక్షురాలు చింతల సప్నస్వామి, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు దాకి స్వామి, యెనిశెట్టి అశోక్, విప్లవ్, దండు శివకుమార్‌తోపాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకల్లో మున్సిపల్ చైర్మన్



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

నారాయణఖేడ్, మే 21, ప్రభాతవార్త:

నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ స్వగృహంలో భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కార్ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పి కోఆప్షన్ సభ్యులు రషీద్, ఖేడ్ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు తాహిర్ అలీ, బిసిసెల్ అధ్యక్షులు సాయిలు, మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద, మహేందర్, లక్ష్మణ్, మైతబ్, అంత్వార్‌సర్పంచ్ చెన్ను, మాజీ జడ్పిటిసి చందర్ నాయక్, అంబేద్కర్ పూలే సమితి అధ్యక్షులు రహీమ్, సుభాష్ సర్పంచ్, సంగమేష్, రేగోడ్‌మండలకాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షులు, సుభాష్‌రెడ్డి, నారాయణ రెడ్డి, బక్షి రాం, లింగప్ప, గౌస్ చిస్తీ, సాయిచరణ్, మూడ శ్రీను, సంగమేష్ ర్యాకల్, విట్టల్‌రెడ్డి, కృష్ణ, మారుతీ మాజీ సర్పంచ్, మాజీసర్పంచ్ నారా యణ, ఫయాజ్, గౌలి మేఘరం, సర్పంచ్ బోలునాయక్, మాజీసర్పంచ్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ అమలుచేయాలి

-తపస్ మెదక్ జిల్లా కార్యదర్శి మంగ నర్సింలు

పాపన్నపేట, మే 21, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీంలో సిపిఎస్ రిటైర్డ్ ఉద్యోగులను మినహాయించడం హేయమైన చర్య అని తపస్ మెదక్ జిల్లా కార్యదర్శి మంగ నర్సింలు పేర్కొన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల కోసం ప్రతిపాదించిన నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీం అమలులో సిపిఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) రిటైర్డ్ ఉద్యోగుల పట్ల అవలంబిస్తున్న వివక్షను వ్యతిరేకించారు. ఉద్యోగంలో ఉన్నంతకాలం మూలవేతనం నుండి 1.5శాతం నిధులను కటేచేసుకుని క్యాష్‌లెస్ వైద్యం అందించి, రిటైర్ అయిన మరుక్షణమే హెల్త్ కార్డులు చెల్లవనడం ఏరకమైన న్యాయం? అని ఆయన ప్రశ్నించారు. ఎవరికైనా వృద్ధాప్యంలోనే వైద్యం అత్యంత అవసరమన్నారు. వెంటనే రాష్ట్రప్రభుత్వం స్పందించి, సిపిఎస్ రిటైర్డ్ ఉద్యోగులందరికీ నూతన హెల్త్ స్కీం కింద పూర్తిస్థాయి క్యాష్‌లెస్ వైద్యం అందేలా జీవోలో మార్పులుచేయాలని డిమాండ్‌చేశారు.

హమాలీల కొరత వల్లనే లారీలు ఆలస్యం

-డిసివో కరుణాకర్

రైతు రాజయ్య ధాన్యాన్ని తూకం వేయిస్తున్న డిసివో కరుణాకర్

చిన్నశంకరంపేట, మే 21, ప్రభాతవార్త:

హమాలీల కొరత వల్లనే వడ్ల కొనుగోలు ఆలస్యంగా అవుతుందని డిసివో కరుణాకర్ తెలిపారు. బుధవారం మండలపరిధి గవ్వలపల్లి పంచాయతీ అగ్రహారంగ్రామానికి చెందిన రైతు గాయంతి రాజయ్య ధాన్యం కొనుగోలు కేంద్రం నుండి పోవడంలేదు ఆర్థిక ఇబ్బందులు, పంటకోసం చేసిన అప్పులు ఎలాతీర్చాలో తెలియక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం అంబాజీపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతు రాజయ్య ధాన్యాన్ని డిసివో కరుణాకర్ దగ్గరుండి తూకం చేయించారు. లారీలోని ధాన్యం బస్తాలను దింపడానికి మూడురోజుల కంటే ఎక్కువ సమయం పడుతుందన్నారు. రైతులు ఎవరూ అధైర్య పడవద్దని, ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని ఆయన కోరారు. లారీలను కేంద్రం నుండి తరలించే విధంగా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

ఒకే ఈతలో రెండు లేగ దూడలు

లేగదూడలను పరిశీలిస్తున్న గోపాలమిత్ర సూపర్‌వైజర్

వుల్‌కల్, మే 21, ప్రభాతవార్త:

మండల పరిధిలోని లక్ష్మీసాగర్ గ్రామంలో ఒకే ఈతలో రెండు లేగ దూడలకు ఆవుకు జన్మనిచ్చింది. గత ఏడాది ఆవుకు కృత్రిమ గర్భధారణ సూదివేయగా ఆవు రెండు లేగదూడలకు జన్మనిచ్చిందని రైతు ఉప్పరి లక్ష్మన్ ఆనందం వ్యక్తంచేశారు. రెండు లేగదూడలకు ఆవు జన్మనిచ్చిందని తెలుసుకున్న గోపాలమిత్ర సూపర్‌వైజర్ సిహెచ్ అర్జునయ్య రైతు చెంతకు చేరుకుని రెండు లేగదూడలను, ఆవును పరిశీలించి జనరల్ మిక్చర్, మినరల్‌బ్రిక్స్‌లను రైతుకు అందచేశారు. 10రోజులపాటు రెండు లేగదూడలకు ముర్రుపాలు తాగించాలని రైతు ఉప్పరి లక్ష్మణ్‌కు సూచించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర డి.మాణయ్య, రైతులు మంగలి మల్లేశంలు పాల్గొన్నారు.

సమగ్ర వికాసానికి సమ్మర్ క్యాంప్ దోహదం

సమ్మర్ క్యాంపులో మాట్లాడుతున్న అధికారి బాలయ్య

నారాయణఖేడ్, మే 21, ప్రభాతవార్త:

సంగారెడ్డి జిల్లా సమగ్రశిక్ష అసిస్టెంట్ డైరెక్టర్ శంకర్ వేసవి సెలవుల్లో విద్యార్థుల మానసిక, శారీరక వికాసానికి దోహదపడే క్రీడలు, చిత్రకళ, యోగ, సంగీతం, బ్యూటిషన్ తదితర విషయాలలో ఉచితశిక్షణ ఇవ్వడం కోసం ఈ సమ్మర్ క్యాంపును జడ్పిహెచ్ఎస్ నారాయణఖేడ్లో ఏర్పాటు చేశామని, దీనిని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సమగ్రశిక్ష అసిస్టెంట్ డైరెక్టర్ శంకర్ అన్నారు. గురువారం జడ్పిహెచ్ఎస్ నారాయణఖేడ్ సమ్మర్ క్యాంపును సందర్శించిన సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు వేసవిసెలవులలో సమయాన్ని వృధా చేసుకోకుండా తమలో ఉన్న సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి పిఎంసిపాఠశాలలో సమ్మర్‌క్యాంపులు ఏర్పాటుచేశామన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఈక్యాంపులో విద్యార్థులప్రతిభను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ బాలయ్య, సమగ్రశిక్ష సూపరింటెండెంట్ రాజు, మండల విద్యాధికారి విశ్వనాథ్, ఇన్‌ఛార్జి హెచ్ఎం యాదగిరి, ఉపాధ్యాయులు అశోక్‌గౌడ్, రాజయ్య, చంద్రశేఖర్ ఆచార్య, గురునాథ్, ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం దిగుమతికి ప్రత్యేక ఏర్పాట్లు

-తహసీల్దార్ శ్రీనివాస్

రైస్‌మిల్ వద్ద లోడ్‌లతో ఆగి ఉన్న ట్రాక్టర్లు

వెల్దుర్తి, మే 21, ప్రభాతవార్త:

మండలంలోని వ్యవసాయ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని పలు ధాన్యంకేంద్రాలను ఆయన పరిశీలించారు. మూడురోజులుగా ధాన్యం నిలిచిపోయిన ట్రాక్టర్లు, లారీల పరిస్థితిని పరిశీలించిన తహసీల్దార్ శ్రీనివాస్ వెంటనే హమాలీలను ఏర్పాటుచేసి, ధాన్యం దిగుమతి చేయాలని సూచించారు. అలాగే ట్రాక్టర్లు క్రమపద్ధతిలో వెళ్లాలని, అందుకు రైతులు సహకరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ నర్సింగ్‌యాదవ్, రైతులు పాల్గొన్నారు.

రైస్ మిల్లును పరిశీలించిన తూప్రాన్ ఆర్డీఓ

రైస్ మిల్లును పరిశీలిస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

వెల్దుర్తి, మే 21, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన మాసాయిపేటలోని వెంకటేశ్వర రైస్ మిల్లుని గురువారం తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి పరిశీలించారు. అలాగే స్థానిక తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఎంపిడివో విగ్నేశ్వర్, ఎంఆర్ఐ దన్‌సింగ్, జిపిఓస్, పంచాయతీ సెక్రెటరీ, ధాన్యం కొనుగోలు ఇన్చార్జిలతో సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని త్వరిత గతిన రైస్ మిల్లులోకి దిగుమతి చేసుకోవాలని తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి మిల్లర్లకు సూచించారు.

మెదక్-చేగుంట రహదారిపై రైతుల నిరసన

-ధాన్యం మిల్లులకు తరలించాలని రోడ్డెక్కిన రైతులు



మెదక్-చేగుంట రహదారిపై ధర్నా చేపడుతున్న రైతులు

చిన్నశంకరంపేట, మే 21, ప్రభాతవార్త:

ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు రోడ్డెక్కి నిరసన వ్యక్తంచేశారు. మండల పరిధి అంబాజీపేట వద్ద మెదక్-చేగుంట ప్రధాన రహదారిపై గురువారం రైతులు మరోసారి రెండుగంటలపాటు మండుటెండలో నిరసన వ్యక్తంచేశారు. గత శనివారం నిరసన చేపడితే ఇంచార్జి తహసీల్దార్ మహేందర్‌గౌడ్ వచ్చి కేంద్రానికి రోజుకు ఒక లారీని పంపిస్తానని హామీ ఇచ్చారు. కాని లారీలు మాత్రం రాలేదని వారు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నప్పటికీ కేవలం ఇప్పటివరకు నాలుగు లారీలు మాత్రమే వచ్చాయన్నారు. రైతుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యపు ధోరణిని విడనాడాలన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ధాన్యం తరలి వెళ్లలేదని ఆరోపిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రావు, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరావు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. యూరియా కోసం తిప్పలు పెట్టిన ప్రభుత్వం, ఇప్పుడు ధాన్యం తరలించడంలో ముప్పుతిప్పలు పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సహకారసంఘంవారు కనీసం టార్పాలిన్‌లు కూడా అందించలేదని అన్నారు. రైతులు ధర్నా చేయడంతో సుమారు గంటపాటు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ శివానందం రైతులను సముదాయించగా, పోలీసులతో రైతులు వాగ్వివాదానికి దిగారు. అధికారులతో మాట్లాడతామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.